వినకోట సుశీలాదేవి

నేను సరోజని మనసారా ఇష్టపడి చేసుకున్నాను. కానీ ఆ క్షణంలో ఆమెని చేసుకున్నందుకు భవిష్యత్తులో పశ్చాత్తాప పడాల్సిన స్థితి వస్తుందని వూహించలేదు.

నాకు మొదటి నుండీ సౌందర్యవతి అయిన స్త్రీని పెళ్లి చేసుకోవాలని వుండేది. నా కోరిక విని నా మిత్రులు నవ్వేవారు. ఒరేయ్ ఆశకైనా అర్థం వుండాలిరా! నువ్వు నల్లగా కాకిలా వుండి, నీ భార్య అప్సరసలా వుండాలనుకోవడం అన్యాయం!''

''నేను అందంగా లేను కాబట్టే నా భార్య అతిలోక సుందరి అయివుండాలి. అదే నా కోరిక''

''నీ కోరిక బాగానే వుంది కానీ ఈ జన్మలో మాత్రం తీరదు''

వాళ్ల మాటలు వినగానే నాకు రోషం వచ్చింది. ''ఎందుకని తీరదు?'' అనడిగేను.

''ఎందుకేమిటి? నీలాంటివాడిని ఏ పిల్ల ఇష్టపడుతుంది?'' అన్నారు.

''చూస్తాగా!'' ఛాలెంజ్ చేశాను.

అది నేను డిగ్రీలో వుండగా జరిగిన సంభాషణ. నా స్నేహితులతో అలా ఛాలెంజ్ చేసిన రాత్రే నేను తీవ్రంగా ఆలోచించాను. ఆడపిల్లలు మెచ్చుకోవాలంటే మగవాడికి రెండు లక్షణాలుండాలి! ఒకటి అందం. మరొకటి అధికారం.

నాకు అందంలేదు కాబట్టి కనీసం గొప్ప ఉద్యోగమన్నా సంపాదించాలి. ఆ నిర్ణయం నాలో పట్టుదలకి ఆత్మశక్తిని కలిగించింది.

ఆరోజు నుండి కష్టపడి చదవనారంభించాను. డిగ్రీ తర్వాత ఎంఎస్సీ చదివాను బ్యాంకు టెస్టులు వ్రాసి ఆఫీసరయ్యాను. ఒక లక్ష్యం నెరవేరాక మరొక దాని కోసం ప్రయత్నం చేయసాగాను.

''మావయ్య నీకో సంబంధం తెచ్చాడురా!'' అమ్మ ఒకరోజు అంది.

''ఆ అమ్మాయి అందంగా వుంటుందా?'' వెంటనే అడిగాను.

ఫర్వాలేదు ఒక మోస్తరుగా వుంటుంది! కానీ కట్నం అదీ మామయ్య మాటల్ని మధ్యలోనే అడ్డుకుని.

''ఇంకేం చెప్పొద్దు. అమ్మాయి అప్సరసలా వుంటేనే చూస్తాను నాకు కానీ కట్నం అక్కర్లేదు'' ఖచ్చితంగా చెప్పాను.

''అదేం కోరికరా!'' అమ్మ విసుక్కుంది.

అదే నా కోరిక అని చెప్పి వెళ్లిపోయాను.

రెండు నెలల తర్వాత మావయ్య మళ్లీ వచ్చాడు. ''నువ్వు ఇష్టపడే సంబంధం తెచ్చారా!'' అంటూ ఫోటో చూపించాడు.

అమ్మాయి చాలా బాగుంది.

వెంటనే వెళ్లి అమ్మాయిని చూద్దాం మావయ్యా!అన్నాను.

వెళ్లాం. అమ్మాయిని చూశాం. ఫోటోలో కంటే చాలా బాగుంది. నాకు నచ్చింది మావయ్యా! తర్వాత విషయాలు మాట్లాడుకుందాం! అన్నాను!

మావయ్య నవ్వాడు!

''ఒరేయ్ అంత తొందర పనికిరాదురా! నీకా అమ్మాయి నచ్చింది సరే. నువ్వా అమ్మాయికి నచ్చావో లేదో? తెలుసుకోవద్దూ! అన్నాడు.

ఆ మాటతో ఖంగుతిన్నట్లయ్యాను.

నిజమే! ఇంతవరకూ నావైపునుండే ఆలోచిస్తున్నాను. ఈ అందమైన అమ్మాయి నా లాంటి అనాకారిని వరిస్తుందా? రిజల్టు కోసం ఎదురుచూసే విద్యార్థిలా వుంది నా పరిస్థితి!

ఇప్పుడే మన అంగీకారం చెప్తే బెట్టుపోతుంది అంటూ మావయ్య లాక్కొచ్చేశాడు

అయితే సరోజ అంగీకారం చెప్పడం.. మరో వారంలో మా పెళ్లిజరగడం అంతా కలలోలాగా జరిగిపోయింది.

మొదటి రాత్రి సరోజని ఆర్తిగా దగ్గరకు తీసుకుని

''సరోజా నువ్వు చాలా అందంగా వుంటావు!'' అన్నాను.

సరోజ నవ్వింది!

సరోజా నేను నీకు నచ్చానా?

దానికీ నవ్వే సమాధానం వచ్చింది.

''నన్నెందుకు ఇష్టపడదు. నా ఉద్యోగం... హోదా... ముందుఎంతటివారైనా తలొంచాల్సిందే గర్వంగా అనుకున్నాను.

సరోజ తో నా జీవితం చాలా ఆనందంగా సాగిపోతోంది.

ఇంటా బయటా సరోజ అందాన్ని పొగుడుతూ నా అదృష్టానికి అసూయపడుతున్నారు.

నా స్నేహితులయితే మరీను.

''ఏరా ఇప్పుడేమంటార్రా'' అని అడిగాను.

''నువ్వెలాగైనా అదృష్టవంతుడివిరా'' అసూయని దాచుకుంటూ నవ్వారు.

వాళ్ల అసూయ నా ఆనందాన్ని రెట్టింపుచేసింది.

నా భార్య అందంగా వుండాలనే అభిలషించాను కానీ అందమైన భార్యవుండటం వలన ఎన్నో ప్రయోజనాలుంటాయని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటున్నాను.

సినిమానికి వెడితే అప్పటివరకూ టిక్కెట్లులేవని చెప్పిన మేనేజరు సరోజని చూడగానే వెంటనే టిక్కెట్లిచ్చేవాడు.

హోటళ్లకెడితే మాకు సర్వ్ చేయడానికి బేరర్లు పోటీపడేవారు. ఎంత రద్దీగా వున్నా బస్సులో కానీ రైల్లో కానీ వెంటనే సీట్లు దొరికేవి. ఒక్క మాటలో చెప్పాలంటే సరోజ పక్కనుంటే చాలు నా గౌరవ ప్రతిష్టలు ఇనుమడించేవి. నాకు మహారాజ సత్కారాలు జరిగేవి.

అటువంటి సమయాల్లో నా సరోజని చూసుకుని నేను చాలా గర్విస్తుండేవాడిని. ఆమెపై నా ప్రేమ ఇంకా ఇంకా పెరుగుతుండేది. నా అదృష్టానికి నేనే పొంగిపోతుండేవాడిని.

సరిగ్గా అదే సమయంలో నా గర్వాన్ని సంతోషాన్ని హరించే సంఘటన ఒకటి జరిగింది.

మా చిన్నాన్న కొడుకు స్వరూప్ ఫారిన్ లో ఇంజనీరు అయిదేళ్ల తర్వాత ఇండియా వచ్చాడు.

బంధువులందర్నీ పరామర్శిస్తూ మా ఇంటికొచ్చాడు. అతడు కూడా సరోజ అందాన్ని చూసి అప్రతిభుడయ్యాడు.

''వోహ్... ఇటువంటి సౌందర్యం ఫారిన్‌లో వుంటేనా.. విదేశీయులు వెర్రెక్కిపోయేవారు'' అన్నాడు.

అతని మాటలు నాకు నచ్చలేదు. ముఖం చిట్లించాను. కానీ అతడదేమీ లక్ష్య పెట్టలేదు. సరోజ చేసే ప్రతి పనినీ మెచ్చుకోసాగాడు.

వదినా ఈ కూర అద్భుతం. ఈ డిజైన్ మీరే కుట్టారా. మీ సుకుమారమైన వేళ్లు ఎంత కందిపోయాయో కదా.

మీ తోటలో గులాబీలు మీకులా చాలా అందంగా వున్నాయి.

ఇలా సరోజని మెచ్చుకోవడమే తన పని అన్నట్లు ప్రవర్తించాడు. అతను పొగిడినప్పుడల్లా సరోజ ముఖం వెలిగిపోతుండేది. అతడున్న రెండ్రోజులూ నాకు ముళ్లమీద వున్నట్లుంది!

వెళ్లేముందు.

వదినగారూ! మీరు ఫారిన్ తప్పక రావాలి. మిమ్మల్ని చూసి అందరూ మూర్ఛపోతారు. వస్తారు కదూ'' మరీ మరీ చెప్పాడు.

సరోజ ఫోటో అడిగి తీసుకున్నాడు. నాకు ఇష్టం లేకపోయినా సరోజ కోరిక మీద ఇచ్చాను.

అతడు వెళ్లాడు!

హాయిగా ఊపిరి పీల్చాను!

ఆరోజు రాత్రి సరోజ అంది ''స్వరూప్ వెళ్లిపోతే ఇల్లంతా బోసిపోయిందండీ. ఈ రెండురోజులూ రెండు క్షణాల్లా గడిచిపోయాయి''

నేను చిరాగ్గా ఏదో అనబోతుండగా మరో మాట కూడా అంది ఏవండీ ''స్వరూప్ చాలా అందంగా వుంటాడుకదా ఎవరు చేసుకుంటారోగానీ ఆ అమ్మాయి చాలా అదృష్టవంతురాలు. ప్చ్...అందమైన భర్త లభించడం ఎంతో సుకృతం..''

ఆమె నిట్టూర్పు నా గుండెల్లో బాణంలా దిగింది.

నేను షాక్ తిన్నట్లయ్యాను.

భూకంపం వచ్చి అగాధంలోకి కూరుకుపోతున్న అనుభూతి కలిగింది!

సరోజ మనసు తెలిసింది.

ఇక ఆమెతో నేనెలా కాపురం చెయ్యగలను. నా భార్య అందంగా వుండాలని కోరుకున్నందుకు మొదటిసారిగా పశ్చాత్తాప పడసాగాను. ●

రామారావు లేరు — రామగానం ఉంది

చెప్పాపెట్టకుండా పోవడంలో తెలుగు వాళ్ళను మించిన వాళ్ళు లేరు... ఎంతో గొప్ప మేలు చేసి మళ్ళీ వినిపించని పాటలతో పోతారు. ఎమ్మెస్ రామారావుగారూ అంతే చేశారు.

తెలుగు చలనచిత్ర సీమలో తొలి నేపథ్య గాయకుడైన శ్రీ ఎం.ఎస్. రామారావు పాడిన తొలినాటి పాట తేదీ నేడు లభ్యం కావటంలేదు. 50 చిత్రాల్లో ఆయన 150కి పైగా పాటలు, పద్యాలు పాడారు. మరో 50 ప్రైవేట్ పాటలు పాడారు. 1944 నుంచి 1964 దాకా సుమారు రెండు దశాబ్దాలపాటు ఆయన సినిమాల్లో పాటలు పాడినా, వాటిలో ఏవో కొన్ని తప్ప మిగతావేవీ రికార్డుల రూపంలోకానీ, క్యాసెట్లలోగానీ రాలేదు.

దూరదర్శన్‌లో మాత్రం ఆయన అప్పుడప్పుడూ కనిపించి, హనుమాన్ చాలీసాయో, మరికొన్ని లలిత గీతాలో పాడారు. 1989లో తిరిగి 'వీరాజనం' చిత్రంలో ఆ నాటి తన 'తాజ్ మహల్' పాటను మళ్ళీ ఆయన పాడారు. 1944లో తాసిల్దార్ చిత్రంలో 'ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా' అనే ఎంకి పాటతో ఆయన చలనచిత్ర ప్రవేశం జరిగింది. రావు బాలసరస్వతిదేవి పాటలతో హెచ్. ఎం.వి. వారు విడుదల చేసిన 'అలనాటి అందాలు' అనే క్యాసెట్‌లో ఎం.ఎస్. రామారావు, రావు బాలసరస్వతితో కలిసి పాడిన 'ఓ మలయ పవనమా' అనే చక్కని పాట ఉంది. 'మానవతి' అనే చిత్రంలోని ఈ పాటను బాలాంత్రపు రజనీకాంతరావుగారు రచించి, స్వరపరిచారు. 'పాండురంగ మహాత్మ్యం'లో ఆయన 'దారికానని సంసారి' అనే వేదాంతపరమైన పాట పాడారు. కానీ హెచ్.ఎం.వి. విడుదల చేసిన ఆడియో క్యాసెట్లో ఈ పాటలేదు. ఇక 'సీతారామ కళ్యాణం'లో కూడా ఆయన కొన్ని శ్లోకాలు పాడారు. వీటిలో 'లక్ష్మీ క్షీరసాగర

తనయాం' శ్లోకం ఈ సినిమా పాటల క్యాసెట్లో ఉంది.'సప్తర్షోజన విస్తర్ణో, శ్రీ రాఘవం దశరథాత్మజ మప్రమేయం, కౌసల్యా సుప్రజారామా, శ్రీ రామారామ అనే దండకం కూడా ఆయన ఈ చిత్రంలో ఉన్నాయి. అయితే అవేవీ ఈ సినిమా క్యాసెట్లో లేవు. 'షావుకారు' చిత్రంలో 'సంపన్నుండు కావలేడు', 'కలవారి సుతులమనుచు' అనే రెండు పద్యాలు పాడారు. మొదట్లో ఎం.ఎస్.రామారావు సినిమాల్లో హీరోలకు పాడారు. ఆ తర్వాత ఎక్కువగా నేపథ్యగానాలు, వేదాంతపరమైన పాటలు పాడారు. మొదటి రాత్రి, దీక్ష, పిచ్చిపుల్లయ్య, జయసింహ, వినాయక చవితి, హరిశ్చంద్ర, నిరుపేదలు మొదలైన ఎన్నో చిత్రాల్లో ఆయన పటలు పాడారు. దీక్షలో ఆయన పాడిన 'పోరా బాబూ పో' అనే పాట ఆత్రేయ గారి తొలిపాట.

ఆయన 'అల్లూరి సీతారామరాజు' కథను ఒక కథా రూపకంగా గానం చేశారు. ఇది పాటలా మొదలై ఒక నాటకంలాగా సాగుతుంది. ఎం.ఎస్.రామారావు పాడగా, ప్రముఖ నటుడు జగ్గయ్య ఇందులో అల్లూరి పాత్రకు గాత్రదానం చేశారు. ఆయన లలిత గీతాలుకూడా రచించారు. ఆయన పాడగా ఎంతో జనోదరణ పొందిన 'ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధంలో' (తాజ్ మహల్), ఓహోహో పిల్లదాన (నల్లపిల్ల) అనే పాటలు ఆయన స్వీయ రచనలే. అన్నమయ్య దేశి కవిత 'తందానా భళా' మొన్నటి దాకా అప్పుడప్పుడు ఆకాశవాణిలో విన్పించేది. జాతీయ నాయకులపై కూడా ఆయన ఎన్నో పాటలు పాడారు.

ఇక ఆయన రంచించి, స్వరపరచి, గానం చేసిన 'సుందరకాండ' ఎం.ఎస్. రామారావుకు గాయకునిగా పునర్జన్మ నిచ్చింది. 1975లో హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆయన మొదట దీనిని గానం చేయగా, ఆ తర్వాత ఆకాశవాణి దీనిని వారంవారం ప్రసారం చేసినప్పుడు ఇదెంతో జనాదరణ పొందింది. ఆయన ఎన్నో ఊళ్ళు తిరుగుతూ సుందరకాండ గానం చేస్తూ సన్మానాలు సత్కారాలు అందుకున్నారు. 1977లో అప్పటి మంత్రి భాట్టం శ్రీరామమూర్తి ఆయనకు సుందరదాసు బిరుదు ఇచ్చారు. సుందరకాండను హెచ్.ఎం.వి. వారు మూడు లాంగ్ ప్లే (ఎల్.పి) రికార్డులుగా విడుదల చేసింది. అప్పటి నుంచీ 'సుందరకాండ' ఎన్నో రికార్డులు, ఎన్నో క్యాసెట్లు అమ్ముడుపోయింది. ఎం.ఎస్. సుబ్బలక్ష్మి శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం, ఘంటసాల భగవద్గీత తర్వాత ఎం.ఎస్.రామారావు సుందరకాండకు మార్కెట్లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది.

సుందరకాండ తర్వాత ఆయన అయోధ్య కాండను లియో వారు రెండు క్యాసెట్లుగా విడుదలచేశారు. దీనికి సంగీతాన్ని పాలగుమ్మి విశ్వనాథం అందించారు. తర్వాత హెచ్.ఎం.వి. వారు హనుమాన్ చాలీసాను కూడా ఆయన చేత పాడించి క్యాసెట్‌గా విడుదల చేశారు.

ఎన్నో మధుర గీతాలు పాడిన ఎం.ఎస్. రామారావు మనకిక లేరు. కానీ ఆయన పాటలు మాత్రం అజరామరంగా నిలిచిపోతాయి. ఇప్పుడున్న క్యాసెట్లు, రికార్డులు కాక ఆయన తొలినాటి సినిమా పాటల్ని, లలిత గీతాల్ని ఈ తరానికి అందించాలి. ఆయన తొలి వర్ధంతి నాటికైనా ఆయన పాత పాటలన్నిటినీ ఒక చోట కూర్చి విడుదల చేయాలి. ఈ పని ఎవరు చేస్తారు? 60 ఏళ్ల తెలుగు సినిమా సందర్భంగానైనా తెలుగు చిత్ర సీమ ఈ పని చేస్తే తొలి నేపథ్య గాయకునికి అదే నిజమైన నివాళి, ఎం.ఎస్.రామారావు తొలినాటి సినిమా పాటలు, ప్రైవేట్ గీతాల హక్కులన్నీ హెచ్.ఎం.వి. వారివే. ఈ పని హెచ్.ఎం.వి. చేయకపోతే, చిత్ర పరిశ్రమలోని పెద్దలైనా చొరవ తీసుకొని ఆ పని చేయవచ్చు. — ఎ. రామారావు